

పంటభద్రుడు..!

ఉద్యోగ విరమణ అనంతరం ఆయన పంటల సాగుపై దృష్టిసారించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. - 8లో



నాడు-నేడులో పురోగతి..

పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా నాడు నేడు పనులు పూర్తి కావాలని, లేదంటే చర్యలు తప్పవని కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. - 8లో

మార్కెటింగ్ శాఖ ఏడీగా గంగాధర్

విజయనగరం ఫోర్ట్: మార్కెటింగ్‌శాఖ ఏడీగా గంగాధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీగా పనిచేసిన శ్యామ్‌కుమార్‌కు గుంటూరు కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీలు, రైతుబజార్ల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు. మార్కెట్ కమిటీలకు అధిక ఆదాయం తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌ఓగా భాస్కరరావు



విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ)గా డాక్టర్ ఎస్.భాస్కరరావు (ఎఫ్‌ఏసీ) నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వేల్ఫేర్ డాక్టర్ వి.రామిరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఆంధ్ర మెడికల్ కాలేజీలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం డీఎంహెచ్‌ఓగా పనిచేసిన డాక్టర్ ఎస్.వి.రమణకుమారి ఉద్యోగ విరమణ పొందారు. ఆమె స్థానంలో భాస్కరావును ప్రభుత్వం నియమించింది.

అమృత్‌సరోవర్ చెరువుల పరిశీలన



లింగంపేట చెరువు పనులు పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న అధికారులు

లక్కవరపుకోట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో అమృత సరోవర్ పథకం కింద అభివృద్ధి చేస్తున్న చెరువులను రాష్ట్ర బృందం బుధవారం పరిశీలించింది. మండలంలోని కళ్లేపల్లి, చందులూరు, లింగంపేట, వీరభద్రపురం గ్రామాల్లో 2021-22 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి చేసిన చెరువులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పైడిరాజు, జిల్లా రీసోర్స్ పర్సన్ (డీఆర్‌పీ) కె.గొంపస్వామి తదితరులు సందర్శించారు. చెరువుగట్టు పటిష్టత, మొక్కలు నాటే తీరు, పెంపకం, చెరువులోకి వచ్చే నీటి సదుపాయం తదితర అంశాలను భౌతికంగా పరిశీలించారు. ఆయకట్టు రైతులతో మాట్లాడారు. పనుల వల్ల ఎంతవరకు ప్రయోజనం ఉందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ రమ్య, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై నేటి నుంచి వర్క్‌షాప్

విజయనగరం పూల్‌బాగ్: జీ-20 కార్యక్రమాల్లో భాగంగా మహారాష్ట్రలోని పూణే నగరంలో విద్యకు సంబంధించిన వర్కింగ్‌గ్రూప్ సమావేశం కొద్దిరోజుల్లో జరగనుంది. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయం (విజయనగరం)లో జూన్ 1 నుంచి 15 వరకు వివిధ వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ నూతన విద్యావిధానం-2020 (ఎన్‌ఈపీ 2020)పై వర్క్‌షాప్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీటింగ్, ఆడియో, వీడియో, స్పోర్ట్స్ ఈవెంట్స్, ర్యాలీలు, క్విజ్, డిబేట్, పెయింటింగ్, ఫిల్మ్ ప్రదర్శన తదితర అంశాలను నిర్వహిస్తామన్నారు.

ముగిసిన ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

విజయనగరం అర్బన్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. బదిలీల మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా బదిలీ ప్రక్రియ చేపట్టారు. బదిలీ స్థానాలతో కూడిన జాబితాలను శాఖల వారీగా విడుదల కానున్నాయి. జిల్లా స్థాయి కేడర్ పోస్టుల బదిలీలు కొలిక్కి వచ్చింది. జోన్ పరిధిలోని పోస్టుల బదిలీలకు ఆ శాఖల ఉన్నతాధికారులు విజయవాడలో చేపట్టిన కసరత్తు కొనసాగింది. కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ, ప్రణాళిక, సర్వే, సహకార శాఖ తదితర విభాగాల పరిధిలో మండల, జిల్లా స్థాయి బదిలీల జాబితాను విడుదల చేస్తామని ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. రెవెన్యూలో వీఆర్వోలు 141మంది, తహసీల్దార్లు 9 మంది, డీటీలు 17 మంది, సీనియర్ అసిస్టెంట్లు 26, జూనియర్ అసిస్టెంట్లు 18 మంది బదిలీలకు దరఖాస్తు చేశారు. వీరికి ఎక్కడ పోస్టింగ్‌లు కేటాయించారన్న సమగ్ర వివరాలు గురువారం వెల్లడించే అవకాశం ఉంది.

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- దళారులను నమ్మి మోసపోవద్దు
- సమగ్రశిక్ష ఏపీసీ లింగేశ్వరరెడ్డి

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ బి.లింగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి పోస్టుకు మెరిట్ కమ్ రోస్టర్ పాయింట్ ప్రకారం 1:3 నిష్పత్తిలో ఎంపిక జాబితాను జిల్లా స్థాయి ఎంపిక కమిటీకి పంపిస్తామన్నారు. జిల్లా స్థాయిలో నైపుణ్య/వ్యక్తిత్వ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. తుది జాబితా జిల్లా స్థాయి కమిటీ ఆమోదంతో విడుదల చేస్తామన్నారు. ఏడాదిలో ఆరు నెలలు పైబడి కేజీబీవీల్లో పనిచేసిన గెస్ట్ పీజీటీ/సీఆర్‌టీలకు ఏడాది సర్వీసుగా పరిగణించి 0.5 మార్కులు కేటాయిస్తామన్నారు. పోస్టుల ను పారదర్శకంగా భర్తీ చేస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

రైతన్నకు సాగు సాయం

- నేడు వైఎస్సార్ రైతు భరోసా పథకం నిధుల విడుదల
- ఏటా రూ.13,500 సాయం
- ఇప్పటివరకు నాలుగు విడతల్లో రూ.1273.31 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- 2.58 లక్షల మందికి రూ.193.54 కోట్ల సాయం
- పంట నష్టపోయిన రైతులకు రూ.49.46 లక్షల పెట్టుబడి రాయితీ
- నేడు బొబ్బిలిలో జిల్లా స్థాయి సహాయం పంపిణీ కార్యక్రమం
- పాల్గొననున్న మంత్రి బొత్స సత్యనారాయణ



వరి విత్తనాలు చల్లుతున్న రైతు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్/విజయనగరం అర్బన్:

రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నాలుగేళ్లుగా అన్నదాతకు అండగా నిలుస్తోంది. సాగుకు పెట్టుబడి సాయం అందిస్తోంది. సాగునీటి వనరులను అభివృద్ధి చేస్తోంది. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు సాయమందించేలా ప్రతి ఊరిలో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటుచేసింది. వ్యవసాయ సిబ్బందితో సాగుసూచనలు అందిస్తోంది. రాయితీపై యంత్రాలను సమకూర్చుతోంది. సాగును లాభాల బాట పట్టిస్తోంది. అందులో భాగంగానే ఖరీఫ్ పంటల సాగుకు ముందస్తుగా వైఎస్సార్ రైతు భరోసా పథకం నిధులను కర్నూలు జిల్లా పత్తికొండలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విడుదల చేయనున్నారు. జిల్లా స్థాయిలో బొబ్బిలి ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొని జిల్లా రైతాంగానికి రైతు భరోసా సహాయం విడుదల చేస్తారు. దీనికోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

నాలుగేళ్లలో రూ.1273.31 కోట్ల పెట్టుబడి సాయం

వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం కింద ఇప్పటికే నాలుగు విడతల్లో రైతులకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించింది. 2019-20 సంవత్సరంలో 2,03,451 మంది రైతులకు రూ.274.65 కోట్లు, 2020-21లో 2,39,363 మందికి రూ.323.14 కోట్లు, 2021-22లో 2,46,438 మందికి రూ.332.69 కోట్లు, 2022-23లో 2,51,659 మంది రైతులకు రూ.342.81 కోట్లు అందించింది.

నియోజకవర్గాల వారీగా రైతు భరోసా కింద అందనున్న పెట్టుబడి సాయం ఇలా..

నియోజకవర్గం	రైతుల సంఖ్య	నిధులు (రూ.కోట్లలో)
బొబ్బిలి	40,420	30.32
గజపతినగరం	53,514	40.14
చీపురుపల్లి	40,795	30.60
రాజాం	45,048	33.79
విజయనగరం	5,154	3.87
నెల్లిమర్ల	31,966	23.97
ఎస్.కోట	41,427	31.07

రైతన్నల ఖాతాలకే జమ

రైతుభరోసా పథకం నిధులు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లాలోని రైతన్నలకు ఐదో విడతగా 2,58,324 మందికి రూ.193.743 కోట్ల ఆర్థిక లబ్ధికలగనుంది. వీరిలో 2,55,147 మంది రైతులకు రూ.140.331 కోట్లు, అటవీ భూమి సాగుదారులు 1,115 మందికి రూ.0.836 కోట్లు, భూమి లేని సాగుదారులు 2,062 మందికి రూ.1.547 కోట్లు అందించనున్నారు. ఏటా మే నెలలో ఖరీఫ్ సాగు చేసే ముందు రూ.7,500, అక్టోబర్ నెలలో (పంట కోత, రబీ అవసరాలు) కోసం రూ.4 వేలు, జనవరి నెలలో పండించిన ధాన్యం ఇంటికి చేరే వేళ సంక్రాంతికి రూ. 2 వేలు చొప్పున కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రైతుల ఖాతాలకు జమచేస్తున్నాయి. ఇటీవల ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలకు జిల్లాలోని 395.75 హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కజొన్న పంటకు నష్టం జరిగినట్టు వ్యవసాయ శాఖ నివేదికలు సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లాలోని పది మండలాల్లోని 1,595 మంది రైతులకు రూ.49.469 లక్షలు పెట్టుబడి రాయితీ మంజూరైంది. మొక్క జొన్న పంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.12,500 చొప్పు పెట్టుబడి రాయితీని రైతుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేయనుంది.

రైతులకు ఉపయోగం

వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం ఏటా పెట్టుబడి సాయం అందిస్తోంది. ఈ డబ్బులతో రైతులు విత్తనాలు, ఎరువులు, కూలి ఖర్చులకు వినియోగిస్తున్నారు. పంటల సాగుకు పథకం దోహదపడుతోంది. - వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి

మాట నెలబెట్టుకున్నారు



ప్రజాసంకల్ప యాత్ర సమయంలో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగేళ్లపాటు అందించారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్‌కు ముందే అందజేస్తున్నారు. రైతుల కష్టాలు తెలుసుకుని సాగు ఖర్చులకు సాయం అందిస్తున్నది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి సర్కారే. వ్యవసాయంపై మక్కువ పెరిగింది. వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద అందిస్తున్న రూ.13,500 పెట్టుబడి సాయం మా లాంటి పేద రైతులకు ఎంతోగానో ఉపయోగపడుతోంది. రైతు పక్షపాతి అని జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారు. - సిరిపురపు రాముడునాయుడు, రైతు, పెదవేమలి గ్రామం, గంట్యాడ మండలం

పొగాకు ఉత్పత్తులను వినియోగించొద్దు



విజయనగరంలో పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది


- డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: పొగాకు ఉత్పత్తులకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వరకు వైద్య సిబ్బందితో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. సిగరెట్టు వద్దు... పౌష్టికాహారం ముద్దు అంటూ నినదించారు. పొగ తాగడం వల్ల, పొగాకు ఉత్పత్తులు తినడం వల్ల ప్రాణాంతకమైన కేన్సర్, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. సిగరెట్, చుట్ట తాగడం, ఖైనీ, గుట్కా వంటి వాటి జోలికి పోకూడదన్నారు. పొగ ఎక్కువగా తాగినవారు చిన్నవయసులోనే చనిపోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, డెమో చిన్నతల్లి, డీపీహెచ్‌ఎన్‌ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో...

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక గంటస్తంభం నుంచి కోట వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు గద్దె చిరంజీవి పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారిణికి సన్మానం



హాకీ క్రీడాకారిణికి నగదు, జ్ఞాపికను అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

వేపాడ: హాకీ ఇండియా 13వ సబ్ జూనియర్ ఉమెన్ నేషనల్ చాంపియన్ షిప్-2023లో ప్రతిభ కనబర్చిన కె.తులసిని మననేస్తం చారిటబుల్ ట్రస్టు సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. బానాది గ్రామానికి చెందిన కె.తులసి హాకీ పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికైంది. ఈ మేరకు ఆమెకు రూ.10వేల నగదు, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైన్‌తో భవిష్యత్



కళాకృతుల తయారీపై శిక్షణ అందిస్తున్న ఫ్యాషన్ డిజైనర్

పాలకొండ రూరల్: సమాజంలో ఫ్యాషన్ డిజైనర్లకు మంచి భవిష్యత్ ఉందని అంకురం ఫ్యాషన్ డిజైనర్, కోర్సు డైరెక్టర్ అల్లు ప్రియ అన్నారు. పాలకొండశాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ఫ్యాషన్ డిజైన్‌పై బుధవారం అవగాహన కల్పించారు. అందుబాట్లో ఉన్న వస్తువులను సద్వినియోగపర్చుకుని కళాకృతులను తయారు చేసుకునే విధానంపై తర్ఫీదునిచ్చారు. డ్రాయింగ్ ఉపాధ్యాయులు జి.మురళి సహకారంతో విద్యార్థులు కళాకృతులను తయారు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జ్ అధికారి గణేష్‌బాబు, సహాయకులు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ మూల్యాంకనం

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా వ్యాప్తంగా మే 24 నుంచి 31వరకు జరిగిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం బొండపల్లిలోని శ్రీ సాయి సిద్దార్థ జూనియర్ కళాశాలలో గురువారం నుంచి జరుగుతుందని ఆర్ఐఓ ఎం. ఆదినారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన ఎగ్జామినర్స్ జాబితా, ఆర్డర్లను ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యామండలి ఇదివరకే పంపించిందన్నారు. స్పాట్ ఆర్డర్స్ వచ్చిన ఎగ్జామినర్స్ ప్రతిఒక్కరూ ఉదయం 10 గంటలకు మూల్యాంకన విధులకు విధిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైన వారిపై ఇంటర్మీడియట్ విద్యామండలి నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతినెలా హుండీల ఆదాయం లెక్కింపు

- పైడితల్లి ఆలయ ఈఓ కేఎల్ సుధారాణి



హుండీల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ సుధారాణి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయాన్ని ఇకపై ప్రతినెలా లెక్కిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎల్ సుధారాణి అన్నారు. అమ్మవారి కల్యాణ మంటపం ఆవరణలో బుధవారం హుండీల ఆదాంయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి మూడు, నాలుగు నెలలకు అమ్మవారి హుండీలను లెక్కించడం వల్ల సిబ్బంది, సేవకుల కొరత ఏర్పడుతోందన్నారు. దీనివల్ల సకాలంలో లెక్కింపు పూర్తి చేయలేక పోతున్నామన్నారు. వనంగుడి, చదురుగుడి హుండీల లెక్కింపులో పారదర్శకతను పెంపొందించేందుకుగాను ఇకపై ప్రతినెలా లెక్కింపు చేపడతామని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన లెక్కింపులో చదురుగుడి హుండీల నుంచి 31 రోజులకు గాను రూ. 15,01,285 నగదు, 8 గ్రాముల 100 మిల్లీ గ్రాముల బంగారం, 131 గ్రాముల వెండి లభించాయన్నారు. వనంగుడి హుండీల నుంచి రూ. 2,67,833 నగదు, 11 గ్రాముల 100 మిల్లీ గ్రాముల బంగారం, 27 గ్రాముల వెండి లభించాయని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చెక్కుల పంపిణీ



ప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని పోరాం గ్రామ అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు ప్రభుత్వం తరఫున బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. బాధితులు సింగరెడ్డి దాలయ్య, ఎం.శంకరదొర, సింగరెడ్డి పద్మ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు, ఒక్కో గ్యాస్ సిలిండర్ చొప్పున ఉణుకూరు గ్రామ సచివాలయం వద్ద అందించారు. బాధితులకు ఐఏవై ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, తహసీల్దార్ టి.కళ్యాణచక్ర వర్తి పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- డీఆర్వో ఎం.గణపతిరావు



మాట్లాడుతున్న డీఆర్వో ఎం.గణపతిరావు

విజయనగరం అర్బన్: వచ్చే నెల 2 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో డీఆర్‌ఓ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 33 కేంద్రాల్లో నిర్వహించనున్న ఈ పరీక్షలకు ఎటువంటి లోపాలు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లుచేయాలని సూచించారు. పరీక్షలకు 5,610 మంది విద్యార్థులు హాజరవుతారని, అధికారులు తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ పరీక్షల తనిఖీల కోసం మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. సమావేశంలో డీఈఓ లింగేశ్వరరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఎం.దీపిక బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణం, ప్రాపర్టీ గదులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. కోర్టు విచారణలో ఉన్న దీర్ఘకాలిక పెండింగ్ కేసుల్లో ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తయ్యే జ్యుడీషియల్ అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బందితో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఎస్‌ఐ గణేష్ కేసుల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ప్రభావతి



కబడ్డి అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన కె.వి.ప్రభావతి

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా జిల్లాకు చెందిన కె.వి ప్రభావతి ఎన్నికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో బుధవారం జరిగిన రాష్ట్ర అసోసియేషన్ సమావేశంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గంలో విజయనగరం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న కేవీ ప్రభావతిని రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఆమెకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కడంపై జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు రంగారావు దొర, నడిపేన లక్ష్మణరావు, ప్రసాద్, ఈశ్వరరావు, తదితరులు అభినందించారు.

పక్కాగా భూముల రీ సర్వే

- జూలై ఆఖరుకు రెండో దశ సర్వే పూర్తికావాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్, సహాయ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

విజయనగరం అర్బన్: జిల్లాలో సాగుతున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష రెండో విడత సర్వే జూలై నాటికి పక్కాగా పూర్తి చేయాలని సర్వే, రెవెన్యూ అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. గ్రామ సర్వేయర్ నుంచి జేసీ స్థాయి వరకు అన్ని స్థాయిల్లో సర్వే పెండింగ్ పనులను ముగించాలని సూచించారు. జిల్లాలో ఎంపిక చేసిన 300 గ్రామాల్లో రెండో దశ రీ సర్వే ప్రక్రియ తాజా పరిస్థితిపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వే విభాగం అధికారులు, సిబ్బందితో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం సమీక్షించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు, గ్రామ కంఠాల భూములను రీ-సర్వే చేసి అన్ని సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, కేఆర్‌ఆర్‌సీ ఉప కలెక్టర్ సూర్యనారాయణ, విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి ఆర్డీఓలు, సర్వే శాఖ ఏడీ త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ



చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్లు, పాఠ్య పుస్తకాలు పరిశీలిస్తున్న కలెక్టర్

చీపురుపల్లి: ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణ పనులు పూర్తిచేయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. చీపురుపల్లి పట్టణంలోని నాల్గవ సచివాలయం భవన నిర్మాణ పనులను ఆమె బుధవారం పరిశీలించారు. మండలంలోని ఆర్‌బీకేలు, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణాలపై ఆరా తీశారు. రెడ్డిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన రూ.2 లక్షల నిధులతో నిర్మించిన సీసీ కాలువ పనులను పరిశీలించారు. అలాగే, విజయరాంపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పాఠశాల పునఃప్రారంభం నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. చీపురుపల్లి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యాకానుక కిట్లను పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సమగ్ర భూ సర్వే ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ బి.సహదీప్ వెంకట్ త్రివినాగ్, ఆర్డీఓ ఎం.అప్పారావు, డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి కె.రాజ్‌కుమార్, తహసీల్దార్ ఎం.సురేష్, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఎంఈఓ ఎస్.భానుప్రకాష్, మండల ఇంజినీరింగ్ అధికారి డి.రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

229.40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం వేలం



వేలం పాటలో పాల్గొన్న సీఎస్‌డీటీలు

గజపతినగరం: వివిధ రకాల కేసుల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్ ఆధ్వర్యంలో బుధవారం వేలం వేశారు. ఈ వేలం పాటలో పాండ్రంకి సంతోష్ 229.40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రూ.5లక్షల27వేల620లకు పాడి దక్కించుకున్నట్లు డీటీ రవిశంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కోట, దత్తిరాజేరు మండలాల సీఎస్‌డీటీలు ఎన్‌వీవీ ఎస్.మూర్తి, ఆర్.ధనం పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వేస్టేషన్‌లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే జీఆర్‌పీ ఎస్సై ఫోన్ ద్వారా రైల్వేపార్సిల్ కౌంటర్ ఎదురుగా గుర్తు తెలియని 30 నుంచి 40 ఏళ్ల కలిగిన వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు సమాచారం అందిందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు రైల్వేస్టేషన్‌కు వెళ్లి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువులు ఎవరైనా గుర్తిస్తే పోలీసులను సంప్రదించాలని కోరారు.

యువతి ఆత్మహత్య



భవాని(ఫైల్)

బాడంగి: తల్లి మందలించినందుకు మనస్తాపం చెందిన మండలంలోని ఆకులకట్ట గ్రామానికి చెందిన మేకలభవాని (15)ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై ఆర్.జయంతి బుధవారం తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. భవాని గతంలో జరిగిన పదోతరగతి పరీక్షలలో ఉత్తీర్ణురాలుకాలేదని, సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజుచెల్లించి సరిగా చదవడం లేదన్న కోపంతో తల్లి మందలించింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. కుటుంబసభ్యులు గమనించి చికిత్సకోసం విజయనగరం,విశాఖ ప్రభుత్వాస్పత్రులకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి తాత ఫిర్యాదుపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

15 మద్యంబాటిల్స్ పట్టివేత

మండలంలోని గూడెపువలస గ్రామ సమీపంలో వాహనతనిఖీలు చేస్తుండగా కోటిపల్లికి చెందిన సుగ్గురు సత్యనారాయణ 15మద్యం బాటిల్స్ కలిగి ఉండడంతో పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై డి.కొండలరావు చెప్పారు. నిందితుడిపై కేసునమోదుచేసి రిమాండ్ నిమిత్తం బొబ్బిలి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

విజిలెన్స్ దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

విజయనగరం టౌన్: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం జిల్లాలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని గంట్యాడ మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ సాయి కృష్ణరైతు మిత్రగ్రూప్, శ్రీ గంగమాంబ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాప్, పూసపాటిరేగ మండలంలో రైతు మిత్ర ఎంటర్‌ప్రైజెస్. శ్రీ వేంకట సాయి గణేష్ ట్రేడర్స్‌లో తనిఖీలు చేసి విత్తనాల నిల్వలో తేడాలు లేవని గుర్తించారు. రానున్న ఖరీఫ్ కాలంలో విత్తనాల అమ్మకాల్లో ఎటువంటి అక్రమాలు జరగకుండా, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు రైతులకు తప్పకుండా విత్తనాలు సరఫరా చేయాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని షాపుల యజమానులను హెచ్చరించారు. డెంకాడ మండల వ్యవసాయాధికారి పి.నిర్మల, పూసపాటిరేగ మండల వ్యవసాయాధికారి కె.నీలిమ, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం పాల్గొన్నారు.

నాడు నేడులో పురోగతి లేకపోతే చర్యలు

- స్కూళ్ల ప్రారంభం లోగా పనులు పూర్తి కావాలి
- బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలి
- కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్

విజయనగరం అర్బన్: పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోగా నాడు నేడు పనులు పూర్తి కావాలని, వచ్చే సమీక్ష సమావేశం నాటికి పనుల్లో పురోగతి కనబడకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ హెచ్చరించారు. టాయిలెట్స్ కిచెన్ షెడ్స్, మేజర్, మైనర్ మరమ్మతులన్నీ వచ్చే పదిరోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంఈఓ, డీఈలు, ఏఈలతో నాడు నేడు పనుల పురోగతిపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. లేబర్, సిమెంట్ లేని చోట పక్క మండలాల నుంచి సర్దుబాటు చేసుకోవాలని, పనులు ఎట్టి పరిస్థితుల్లో అగకూడదన్నారు. పనులన్నీ పేరెంట్స్ కమిటీలతోనే జరగాలని స్పష్టం చేశారు. గత సమీక్ష 15 రోజుల క్రితం జరిగిందని ఈ 15 రోజుల్లో కొన్ని మండలాల్లో ఎలాంటి పురోగతి కనబడలేదని ఇలాగే ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులను వెంటవెంటనే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఎంఈఓలు ఈ పది రోజుల్లో వారి పరిధిలో ఉన్న పాఠశాలలను సందర్శించి పనుల తీరుపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని పనులు వేగంగా జరిగేలా చూడాలని సూచించారు.

విద్యార్థుల హాజరు కచ్చితంగా ఉండాలి

పాఠశాలల పునః ప్రారంభం తరువాత విద్యార్థుల హాజరు కచ్చితంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే డ్రాప్ అవుట్ వివరాలను కూడా దగ్గర పెట్టుకోవాలని, రెగ్యులర్‌గా బడికి పిల్లలు వచ్చేలా చూసే బాధ్యత టీచర్లదేనని అన్నారు. మధ్యాహ్న భోజనం క్వాలిటీ, మెనూ తప్పనిసరిగా పాటించాలని, తనిఖీల్లో తాను కూడా భోజనం చేస్తానన్నారు. తాగునీరు, టాయిలెట్స్ అన్ని స్కూల్స్‌లో ఉండాలని కోరారు. సబ్జెక్టు టీచర్స్ విద్యార్థులకు క్లాసులు తీసుకునేటప్పుడు వారికి ఆసక్తి కలిగేలా బోధించాలని ఏ తరగతిలోనైనా ఏవిద్యార్థినైనా ర్యాండమ్‌గా చదివిస్తానని విద్యార్థులు చదవలేకపోయినా ప్రశ్నలు చెప్పలేకపోయినా సంబంధిత ఉపాధ్యాయులే బాధ్యత వహించాలని అన్నారు. 10వ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత చెందేలా మొదటి రోజు నుంచే ప్రణాళికా బద్ధంగా బోధించాలని సూచించారు. వచ్చే ఏడాది ఫలితాలు మెరుగుపడాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఈఓ లింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటభద్రుడు..!

- కలం పట్టిన చేతితో హలం
- నాడు ఉపాధ్యాయుడు... నేడు కర్షకుడు
- ఉద్యోగ విరమణ అనంతరం సేంద్రియ సాగుపై దృష్టి
- సాధిస్తున్న ఉత్తమ ఫలితాలు
- పలుచోట్ల సత్కారాలు, సన్మానాలు
- పలువురు రైతులకు ఆదర్శం



గౌరీశ్వరరావు సాగు చేసిన దేశవాళీ కాలభట్ పంట



వరిపొలంలో ప్రకృతి సాగుచేస్తున్న రైతు గౌరీశ్వరరావు

రాజాం: ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన ఆదాయంతో ఇంటి వద్దే సంతోషంగా జీవనం సాగిపోతుందని ఆలోచించే ఈరోజుల్లో ఆయన మాత్రం ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో ముందుకు అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా కలం పట్టిన చేతితో హలం పట్టారు. పాఠశాల బోధన ముగిశాక పొలం బాటలో నడుస్తున్నారు. దేశవాళీ విత్తనాలతో సేంద్రియ సాగు ప్రధాన లక్ష్యంగా చేసుకుని తనకు ఉన్న వ్యవసాయ భూమిలో సాగు ప్రారంభించారు. అది కూడా ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ సాగు పద్ధతిని అవలంబిస్తూ ఫలితాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయనే రాజాం పట్టణంలో అమ్మవారికాలనీలో నివాసముంటున్న పెంకి గౌరీశ్వరరావు. ఆయన స్వగ్రామం వంగర మండలం కొత్తవలస. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 2012లో ఉద్యోగ విరమణ చేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఆయన తన ఉద్యోగ కాలంలో ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. ఉద్యోగ విరమణ అనంతరం వ్యవసాయంపై దృష్టి సారించి పదిమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



ఇలా పలువురికి శిక్షణ ఇస్తూ..

మంచి సాగు

గౌరీశ్వరరావు చేస్తున్న సాగు చాలా మంచి ఉత్పత్తులను ఇస్తోంది. పూర్తిగా రసాయన ఎరువులను నివారించింది. ఉపాధ్యాయుడిగా రిటైర్ తరువాత కూడా వ్యవసాయంపై మక్కువతో సాగుచేసి, పలువురికి ఆదర్శంగా నిలవడం ఆనందదాయకం.

– కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం



సేంద్రియ సాగుతో వచ్చిన మామిడి దిగుబడి

పలువురికి ఆదర్శం

గౌరీశ్వరరావు మాస్టారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం సాగు చాలామంది రైతులకు ఆదర్శం. ఇటీవల ఆయన చేస్తున్న సాగును పరిశీలించాం. పూర్తిగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్నారు. ఎంతోమంది రైతులకు గౌరీశ్వరరావు ఆదర్శం.

– ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, ఎంపీపీ, వంగర

పాత పద్ధతిలో కొత్త సాగు..

తల్లిదండ్రులు తన చిన్నవయస్సులో పండించిన పంట విధానాన్ని ఆయన అవలంబిస్తున్నారు. కొత్తవలస గ్రామంలో తనకున్న నాలుగు ఎకరాలను ఇందుకు సిద్ధం చేసుకున్నారు. పెంటగెత్తం, గొర్రెల మంద పేడ, పచ్చిరొట్ట ఎరువులతో దేశవాళీ విత్తనాలు వేసి వరిపంట పండిస్తున్నారు. కుటుంబ అవసరాలకు వినియోగిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయకులు పాలేకర్ శిక్షణ తరగతులకు హాజరవుతూ ద్రవజీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, ఇంగువ ద్రావణం, గోబాణం, బ్రహ్మాస్త్రం తయారుచేసి, వాటిని ఉపయోగించడం నేర్చుకున్నారు. వాటితో తనకున్న పొలాల్లో రెండెకరాల్లో వరి పంటలు, నాలుగు ఎకరాల్లో మామిడి, జీడి తోటలు సాగుచేస్తున్నారు.

రెండేళ్లుగా విస్తృతంగా..

పదేళ్లుగా సేంద్రియ సాగు చేస్తున్న గౌరీశ్వరరావు పంటలకు రెండేళ్లుగా విశేష ఆదరణ కనిపిస్తోంది. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంతో వరి పంటలో అధికంగా దిగుబడులు రావడంతో ఇతర రైతులు కూడా ఈ సాగుకు ఆకర్షితులవుతున్నారు. రబీలో కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో కాలభట్, మైసూర్ మల్లిక, మదన్‌హాలైసన్నాలు వంటి పంటలు సాగుచేసి ఔరా అనిపించారు. ఈ పంటలకు మంచి దిగుబడిరావడంతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

ఏడాదికి మూడు పంటలు

గౌరీశ్వరరావు తన పొలాల్లో ఏడాదికి మూడు పంటలు సాగుచేస్తున్నారు. ఖరీఫ్‌లో వరి, రబీలో పెసర, మినప పంటలు వేసి, వెంటనే నువ్వు, రాగి వంటి పంటలు సాగుచేస్తున్నారు.

పరిశీలన సాగుగా..

గౌరీశ్వరరావు చేస్తున్న సాగును పలు విద్యాసంస్థలు, వ్యవసాయ సంస్థలు పరిశీలిస్తున్నాయి. గౌరీశ్వరరావు పట్టుదలను విద్యార్థులకు వివరిస్తున్నారు. పలు సంస్థల్లో జరిగే ప్రేరణ కార్యక్రమాలు, వ్యవసాయ విధానాలపై గౌరీశ్వరరావుతో ప్రత్యేక శిక్షణలు, తరగతులు నిర్వహిస్తున్నారు. గుంటూరు, అనంతపురం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో సేంద్రియ సాగు, ప్రకృతి సాగుచేసే రైతుల వివరాలు, సక్సెస్ స్టోరీలు, ఫలితాలపై ప్రత్యేక కథనాలను వ్యవసాయశాఖ, తోటపల్లి రిజర్వాయర్ సంస్థ ఆయనతో రాయించి, పుస్తకాలు ప్రచురించింది. సినీ దర్శకుడు ఆర్.నారాయణమూర్తి డైరెక్షన్‌లో వచ్చిన అమృతభూమి సినిమాలో గౌరీశ్వరరావు రైతు పాత్రలో నటించి, వ్యవసాయంపై అవగాహన కల్పించే అవకాశం దక్కించుకున్నారు. పలుచోట్ల సత్కారాలు, సన్మానాలు పొందారు.

5న చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

- కాలుష్య నియంత్రణ మండలి ఈఈ టి.సుదర్శనం



టి.సుదర్శనం, పర్యావరణ ఇంజినీర్

విజయనగరం రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ టి.సుదర్శనం బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని గురజాడ ప్రజా గ్రంథాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. 5వ తరగతి నుంచి 7వ తరగతి, అలాగే 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు రెండు విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్, బీట్ ది ప్లాస్టిక్ పొల్యూషన్ అంశాలపై పోటీలు ఉంటాయని వివరించారు.

మినీ జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో పరీక్ష రాస్తున్న యువత

పార్వతీపురంటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కుమార్ మాట్లాడుతూ డాక్టర్ రెడ్డీస్ ఫార్మా, ఎంఎస్‌ఎన్ ల్యాబొరేటరీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 155మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా వారిలో నలుగురు ఎంఎస్ఎన్ లాబొరేటరీ కంపెనీలో, 15మంది రెడ్డీస్ ఫార్మాలో ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఎస్వీడీ కళాశాలలో ఇప్పటివరకు ఆరు జాబ్ మేళాలు నిర్వహించి సుమారు 800మంది వరకు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు.

వెయిట్ లిఫ్టర్‌కు ప్రోత్సాహక నగదు బహుమతి



పల్లవికి ప్రోత్సాహక నగదు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జూలై 28నుంచి ఆగస్టు 5వరకూ ఢిల్లీలో జరగనున్నాయని, ఆ పోటీల్లో 64 కిలోల సీనియర్ విభాగంలో సత్య కళాశాల విద్యార్థిని సేనాపతి పల్లవి ఎంపికవడం ఆనందంగా ఉందని కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి , కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కళాశాల ఆవరణలో పల్లవిని ప్రోత్సహిస్తూ పౌష్టికాహారం నిమిత్తం ఆమెకు ఆరు నెలలకు సరిపడా రూ.లక్షా 80వేల నగదు అందజేశారు. పల్లవికి మంచి భవిష్యత్తు ఉందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించి, దేశానికి , రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రానున్న పోటీల్లో మరిన్ని పతకాలు సాధించాలని ప్రోత్సహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ.సాయిదేవమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోచ్ చల్లారాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతు పురస్కారానికి ఎంపికైన డాక్టర్ శ్రీరాములు



డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు

పార్వతీపురం టౌన్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం వార్షిక వి. రామచంద్రరావు ఉత్తమ రైతు పురస్కారానికి 2023 సంవత్సరానికి గాను పార్వతీపురానికి చెందిన డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు మాస్టారును ఎంపిక చేసినట్లు వ్యవసాయ విద్యాలయ డైరెక్టర్ ఎల్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాన్ని జూన్ 12వ తేదీన విద్యాలయ కాన్వొకేషన్ హాలులో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పురస్కారానికి ఎంపికైనందున జట్టు ఆశ్రమ డైరెక్టర్ డి.పారినాయుడు మంచుపల్లి శ్రీరాములును అభినందించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 510.00
విజయనగరం	రూ. 514.00
శ్రీకాకుళం	రూ. 514.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,930–00
బంగారం(22సి. 10గ్రా.)	55,850–00
వెండి (కిలో)	76,800–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹154	₹278	₹ 288

పర్యావరణ పరిరక్షణలో యువత కీలకపాత్ర పోషించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అధ్యాపకులు



పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం రూరల్: పర్యావరణ పరిరక్షణలో యువత కీలకపాత్ర పోషించాలని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ టి.సుదర్శనం పేర్కొన్నారు. మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా విజయనగరంలోని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల, మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం పర్యావరణ పరిరక్షణ–మన జీవనశైలి అంశంపై అవగాహన నిర్వహించారు. భవిష్యత్ తరాల మేలు కోసం అడవుల సంరక్షణ, మొక్కలు నాటడం, కాలుష్య నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా వాతావరణంలో అకాల మార్పులు సంభవిస్తున్నాయన్నారు. వాయుకాలుష్యం, వాహన కాలుష్యం అరికట్టడానికి మన వంతు ప్రయత్నం చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అఖండ నామ సంకీర్తన ప్రారంభం



అఖండనామ సంకీర్తనలు ప్రారంభిస్తున్న చెరుకూరి శ్రీధర్, రామకృష్ణ

విజయనగరం టౌన్: స్థానిక టౌన్‌సెంటర్ లేఅవుట్, రింగురోడ్డులో కొలువైన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో హరే రామ..హరే కృష్ణ మహామంత్ర 108 రోజుల అఖండ నామ సంకీర్తన బుధవారం ఘనంగా ప్రారంభించారు. శ్రీనివాస సేవా సంఘం అధ్యక్షుడు చెరుకూరి శ్రీధర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల దివ్య జీవన సంఘం అధ్యక్షుడు చిల్ల రామకృష్ణ ఆధ్వర్యంలో భజనబృందాలతో అఖండ నామ సంకీర్తన నిర్వహిస్తారని తెలిపారు. అఖండ నామ సంకీర్తన వల్ల దైవత్వంతో కూడిన మంచి ఆలోచనలు, ఆధ్యాత్మిక శక్తి పెరిగి అందరికీ మంచి జరుగుతుందన్నారు. భక్తులందరూ సంకీర్తనలలో పాల్గొని తరించాలని కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సేవకులు, భక్తులు పాల్గొన్నారు.